క్లుప్తంగా

50కిలోల ప్లాస్టిక్ సీజ్



జరిమానా విధించి రశీదు అందజేస్తున్న శ్రీనివాస్

నారాయణఖేడ్: మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు పట్టణంలో పలు దుకాణాలు, వ్యాపార, వాణిజ్య సంస్థలను మున్సిపల్ శానిటరీ అధికారి శ్రీనివాస్ కార్మికులతో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నిషేధిత ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు తదితర సామగ్రిని విక్రయించడం, వినియోగిస్తున్నట్లు గుర్తించారు. 50కిలోల ప్లాస్టిక్ సామగ్రిని సీజ్ చేసి యజమానులకు జరిమానా విధించారు. ప్లాస్టిక్ సామగ్రి విక్రయించినా, వినియోగించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

కుష్టువ్యాధి నిర్మూలనకు కృషి



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది

నారాయణఖేడ్: కుష్టువ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా పొగాకు నియంత్రణ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి, నిజాంపేట ఆస్పత్రి వైద్యాధికారిణి సుశీల కోరారు. కుష్టువ్యాధి పక్షోత్సవాల్లో భాగంగా గురువారం మండల కేంద్రం నిజాంపేటలోని ప్రభుత్వ ఆస్పత్రి, ఉన్నత పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కుష్టువ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. కుష్టువ్యాధి నిర్మూలనకు కృషి చేస్తామని ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

న్యూట్రిషన్ కిట్ల పంపిణీ



కిట్లను పంపిణీ చేస్తున్న వైద్యులు

రామచంద్రాపురం (పటాన్‌చెరు): రామచంద్రాపురంలోని ఈఎస్‌ఐ ఆస్పత్రిలో ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం దాత సహకారంతో రోగులకు న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ ఆదిత్య ఆధ్వర్యంలో అందరితో టీబీ వ్యాధి నిర్మూలనకు ప్రతిజ్ఞ చేయించారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



పరీక్షలు నిర్వహించిన వైద్య సిబ్బంది

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని తడ్కల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. జ్వరాలు, జలుబుతో రోగుల సంఖ్య పెరుగుతున్నందున తడ్కల్ ఆరోగ్య ఉపకేంద్రం పరిధిలో ప్రతి నెల విద్యార్థులకు చికిత్సలు చేస్తున్నట్లు ఏఎన్ఎం సమీర్ తెలిపారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు అంజనా జోషి ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మందులు మాత్రలు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు, ఉప కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

వట్‌పల్లి(అందోల్): మండలంలోని పోతులబోగుడా మోడల్ పాఠశాలలో గురువారం గ్లోరీస్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. 200 విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా 50 మంది విద్యార్థులకు కంటి సమస్యలతో పాటు కొందరికి కళ్లలో నీరు కారడం వంటి సమస్యలను గుర్తించి పరీక్షలు చేశారు. వారికి కళ్లద్దాలు వాడాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డీన, పీఈటీ అరుణ, గ్లోరీస్ కంటి ఆస్పత్రి ఆప్టికల్స్ షద్రక్, మహేందర్, ఆర్ఎంపీ శేఖర్, షకీల్ పాల్గొన్నారు.

పంటల అధిక దిగుబడే లక్ష్యం

- సేంద్రియ ఎరువులపై రైతు దృష్టి
- పశువులు, కోళ్ల ఎరువుల కోసం పాట్లు
- అధికారుల సలహాలు తీసుకుంటున్న రైతులు



వ్యవసాయ పొలాల్లో సేంద్రియ ఎరువు చెల్లిన రైతు

మునిపల్లి(అందోల్): వివిధ రకాల పంటల్లో అధిక దిగుబడి సాధించాలనే లక్ష్యంతో రైతులు పశువులు, కోళ్ల ఎరువుల కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. రసాయన ఎరువుల కంటే సేంద్రియ ఎరువులే భూమికి బలం.. ఇప్పటికే కొంత మంది రైతులు కోళ్ల ఎరువులను పొలాల్లో చల్లారు. రసాయన ఎరువుల ధరలు ఆకాశనంటడంతో సేంద్రియ ఎరువులపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. పంటల్లో అధిక దిగుబడి సాధించేందుకు రైతులు పశువుల ఎరువులు, కోళ్ల ఎరువులను కొనుగోలు చేస్తూ వ్యవసాయ పొల్లాల్లో వేస్తున్నారు. దీంతో మేకల, గొర్రె,ల, కోళ్ల ఎరువులకు మంచి డిమాండ్ పెరిగింది. కోళ్ల ఎరువులు కొద్దిపాటి వర్షం పడితే పొలంలో కలిసి పోతుంది. కోళ్ల ఎరువు, పశువుల ఎరువు దొరకక పోతుండడంతో కొంత మంది రైతులు రసాయన ఎరువులపై ఆధారపడుతున్నారు. కోళ్ల ఎరువు 10 కిలోల బస్తా రూ.500–900 వరకు ధర ఉంటుంది. కొందరు రైతులు పంట పూర్తికాగానే సేంద్రీయ ఎరువులను వ్యవసాయ పొలాల్లో వేస్తున్నారు. కోళ్ల ఎరువులను ఎక్కువగా వినియోగించడంతో డిమాండ్ పెరిగింది. దీంతో కోళ్ల ఎరువు కోసం రైతులు వేసవికి ముందే కోళ్ల ఫారాల యజమానులకు అడ్వాన్సు ఇస్తున్నట్లు రైతులు చెబుతున్నారు.

సేంద్రియ ఎరువులే మేలు..



రసాయన ఎరువుల కంటే పశువులు, కోళ్ల ఎరువులతో అధిక దిగుబడి సాధించవచ్చు. సేంద్రియ ఎరువులు త్వరగా పొలంలో కలిసిపోతాయి. అంతేకాకుండా పశువులు, కోళ్ల ఎరువు తక్కువ ధరకు దొరుకుతోంది.

–ప్రశాంత్‌రైతు, ఎటిగడ్డ సంగ్యం, సదాశివపేట

అధిక దిగుబడి..



సేంద్రియ ఎరువులతోనే పంట అధిక దిగుబడి సాధించి లాభాలు సాధించే అవకాశం ఉంటుంది. రసాయన ఎరువుల వల్ల భూమి, పంట దెబ్బతినడమే కాకుండా పంట దిగుబడి అంతంత మాత్రంగానే వస్తుంది. సేంద్రియ ఎరువులతో భూమి సారవంతం కావడమే కాకుండా దిగుబడి ఎక్కువగా వస్తుంది.

–శివప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి

అసత్య ఆరోపణలు చేస్తే సహించం

పీసీసీ మైనారిటీ విభాగం రాష్ట్ర కార్యదర్శి హకీం



విలేకరులతో మాట్లాడుతున్న హకీం

హత్నూర(సంగారెడ్డి): కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్‌ఎస్ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తే సహించబోమని పీసీసీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి హకీం అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 13 నెలల కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన పథకాలన్నింటిని ఒక్కొక్కటిగా అమలు చేస్తుందన్నారు. మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డిలపై వ్యక్తిగత విమర్శలు చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. గృహిణిగా ఉండే సునీతారెడ్డిని ఎమ్మెల్యే చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. మాజీ సీఎం కేసీఆర్ మిగులు బడ్జెట్‌లో ఉన్న రాష్ట్రాన్ని అప్పుల తెలంగాణగా మార్చాడని ఆరోపించారు. సమావేశంలో నాయకులు క్రిష్ణ, ప్రసాద్, గౌస్, కృష్ణాగౌడ్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

మొగి పురుగును నియంత్రించాలి

ఏడీఏ నూతన్‌కుమార్



వరిపంటను పరిశీలిస్తున్న ఏడీఏ నూతన్‌కుమార్

కల్హేర్(నారాయణఖేడ్): వరిసాగులో కాండం తొలుచు పురుగు (మొగిపురుగు) ఆశించకుండా నియంత్రించాలని ఏడీఏ నూతన్ కుమార్ సూచించారు. గురువారం కల్హేర్ మండల కేంద్రంలో వరి, జొన్న పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. వరిపొలంలో నీరు పలచగా ఉంచాలి.. నీరు పెడుతూ.. ఆర బెడుతూ ఉండాలి. కాంప్లెక్స్ ఎరువులు వాడకూడదు. తెగుళ్లు ఉన్నప్పుడు యూరియా వాడవద్దని సూచించారు. మొగి పురుగు నివారణ కోసం కార్టాప్ హైడ్రో క్లోరైడ్ 400 గ్రాములు ఒక ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి, లేదా క్వినాల్ ఫాస్ 2 మిల్లీలీటర్ ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని వివరించారు. కార్యక్రమంలో ఏఓ వెంకటేశం, ఏఈఓ సంతోష, పీఏసీఎస్ చైర్మన్ గంగారెడ్డి పాల్గొన్నారు.

తప్పులు లేకుండా ఎంట్రీ చేయాలి

డీఆర్డీఓ ఏపీడీ బాలరాజ్



డేటా ఎంట్రీని పరిశీలిస్తున్న బాల్‌రాజ్

కంది(సంగారెడ్డి): రైతు భరోసా పథకం కోసం చేస్తున్న డేటా ఎంట్రీని తప్పులు లేకుండా చేయాలని డీఆర్డీఓ ఏపీడీ బాల్‌రాజ్ పేర్కొన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో చేస్తున్న డేటా ఎంట్రీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2023లో కనీసం ఉపాధి హామీలో 20 రోజులు పని చేసి భూమి లేకుండా ఉన్నవారి పేర్లను నమోదు చేయాలన్నారు. డేటా నమోదులో వస్తున్న ఇబ్బందులను సిబ్బంది ఏపీడీ దృష్టికి తెచ్చారు. అనంతరం వన నర్సరీని పరిశీలించారు. మొక్కలు ఎండిపోకుండా చూడాలని.. నర్సరీల్లో నీడనిచ్చే మొక్కలు, పండ్ల మొక్కలను పెంచాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్లాంటేషన్ మేనేజర్ మణికుమార్, ఉపాధి హామీ ఏపీఓ గురుపాదం, కంది పంచాయతీ ఈఓ విద్యాధర్‌గౌడ్, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు భరోసాకు 1,053 దరఖాస్తులు



దరఖాస్తులను స్వీకరిస్తున్న సారిక

రాయికోడ్(అందోల్): మండలంలోని ఆయా గ్రామాల రైతుల నుంచి రైతు భరోసా పథకం కోసం సుమారు 1,053 దరఖాస్తులు వచ్చాయని మండల వ్యవసాయాధికారి సారిక తెలిపారు. రాయికోడ్‌లోని రైతు వేదికలో గురువారం 120 మంది రైతుల నుంచి దరఖాస్తు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు భరోసా దరఖాస్తుకు శుక్రవారంతో గడువు ముగుస్తుందన్నారు. తమకు వచ్చిన దరఖాస్తులను క్షుణంగా పరిశీలించి, ఉన్నతాధికారులకు నివేదిస్తానన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు, సిబ్బంది వివిధ రైతులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఏఎంసీ చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి



నీటిని వదులుతున్న అధికారులు

వట్‌పల్లి(అందోల్): రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని తాలెల్మ ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాసంగిలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నీటిని వదులుతున్నామన్నారు. 3వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామని తెలిపారు. తాలెల్మ, గడిపెద్దాపూర్, కన్సన్పల్లి, కెరూర్, మన్నాన్పల్లి, కుసంగి వెంకట్ రెడ్డి తదితర గ్రామాలకు సాగునీరు అందుతుందన్నారు. నీటి విడుదలపై రైతులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎత్తిపోతల పథకం చైర్మన్ లింగాగౌడ్, ఇరిగేషన్ ఈఈ జైభీమ్, ఏఈ మజార్, తలేల్మా మాజీ సర్పంచ్ గంగాధర్ అశోక్, మాణిక్యం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ బోర్డులో తాగునీటి ఇబ్బందులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలోని ప్రజలు తాగు నీటి కోసం అవస్థలు పడుతున్నారు. హౌసింగ్ బోర్డు కాలనీలో మిషన్ భగీరథ, బోరు మోటారుతో నీటి సరఫరా చేస్తున్నారు. మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీల మరమ్మతులు కారణంగా మూడు రోజుల పాటు నీటి సరఫరా నిలిచిపోయింది. కాలనీలోని బోరు మోటారు కూడా చెడిపోయింది. సకాలంలో మరమ్మతులు చేయకపోవడంతో కాలనీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి బోరుకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా, జైలుశిక్ష విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. బుధవారం నిర్వహించిన తనిఖీల్లో తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపరచగా నలుగురికి రూ.2 వేలు జరిమానా, ముగ్గురికి రూ.1500 జరిమానా.. మరో ఇద్దరికి రూ.1000 జరిమానా.. రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

రైతు భరోసాకు నేడే ఆఖరు

కంగ్టి(నారాయణఖేడ్): రైతు భరోసా పథకంలో లబ్ధిపొందేందుకు నూతన పట్టాదారులకు శుక్రవారం వరకే గడువు ఉందని ఏడీఏ నూతన్‌కుమార్ తెలిపారు. మండలంలో భూభారతిలో నూతనంగా జనవరి 1 లోగా భూమి పట్టా చేసుకొన్న రైతులతో పాటు డిజిటల్ డాక్యుమెంట్లు చేసుకొన్న రైతులు దరఖాస్తుతో పాటు ఆధార్‌కార్డు, బ్యాంకు పుస్తకం జిరాక్స్‌లు జతచేసి సంబంధిత ఏఈఓలకు శుక్రవారం సాయంత్రంలోగా సమర్పించాలని సూచించారు.

గడ్డపోతారం కమిషనర్‌గా జేత్రం



నూతన కమిషనర్ సన్మానించిన నాయకులు

జిన్నారం (పటాన్‌చెరు): గడ్డపోతారం మున్సిపాలిటీ కమిషనర్‌గా డి.జైత్రం గురువారం బాధ్యతలు స్వీకరించారు. మాజీ సర్పంచ్ ప్రకాష్‌చారి ఆయనకు స్వాగతం పలికారు. శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

బొల్లారం కమిషనర్‌గా మధుసూదన్ రెడ్డి బాధ్యతలు స్వీకరణ..

బొల్లారం మున్సిపాలిటీ కమిషనర్‌గా మధుసూదన్ రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన అమీన్‌పూర్ మున్సిపాలిటీలో ఆర్‌ఓగా విధులు నిర్వహించారు. గతంలో కమిషనర్‌గా విధులు నిర్వహించిన మంగతాయారు బదిలీపై జీహెచ్ఎంసీ కార్యాలయానికి వెళ్లారు.

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న అతిమేల మాణిక్

నారాయణఖేడ్: అంగన్‌వాడీ భవనాన్ని నాసిరకంగా నిర్మాణం చేసిన, ఇటీవల మరమ్మతుల్లో నాణ్యతా పాటించని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా మాజీ అధ్యక్షుడు మాణిక్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. భవనం పైకప్పు పెచ్చులూడి విద్యార్థులు, అంగన్‌వాడీ టీచర్‌కు గాయాలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. రెండేళ్ల క్రితం చేపట్టిన రూ.1.50లక్షలతో భవనం మరమ్మతులు నాసిరకంగా చేశారని ఆరోపించారు. కాంట్రాక్టర్, రికార్డు చేసిన సంబంధిత అధికారిపై చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ టీచర్, సీడీపీఓపై సస్పెన్షన్ వేటు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సంఘం డివిజన్ కార్యదర్శి రమేష్, నాయకులు సతీష్, మహిపాల్, ప్రవీణ్, అరుణ్, కాన్షీరాం, సంతోష్ పాల్గొన్నారు.



రాయికోడ్(అందోల్): గాంధీ చిత్రపటానికి వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు



సంగారెడ్డి: విగ్రహం వద్ద ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తదితరులు

మహాత్మా.. జ్ఞానోదయం కల్గించు..

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి గురువారం నాటికి 420 రోజులైనా.. ఆ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేయలేదని బీఆర్ఎస్ నిరసన వ్యక్తం చేసింది. ఆ పార్టీ నాయకులు పలుచోట్ల హామీలు అమలు చేసేలా సీఎం రేవంత్‌రెడ్డికి జ్ఞానోదయం కలిగించాలని కోరుతూ గాంధీ విగ్రహాలకు వినతిపత్రాలు సమర్పించారు. మోసపూరిత పాలనపై నిరసన తెలిపారు.



నారాయణఖేడ్: నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు



జిన్నారం: గాంధీ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు



రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ పరిధిలో..

ప్రతీఒక్కరు హెల్మెట్ ధరించాలి



హెల్మెట్లు పంపిణీ చేస్తున్న పోలీసులు

సంగారెడ్డి క్రైమ్: ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలని సంగారెడ్డి ట్రాఫిక్ సీఐ సుమన్‌కుమార్ పేర్కొన్నారు. ప్రమాదాల నివారణకై గురువారం పట్టణంలోని పోతిరెడ్డిపల్లి చౌరస్తా వద్ద మహీంద్రా అండ్ మహీంద్రా కంపెనీ వారి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. డ్రైవింగ్ చేసే సమయంలో సీటు బెల్ట్ తప్పనిసారిగా ధరించాలన్నారు. మితిమీరిన స్పీడుతో యువత ప్రాణాలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిద్రలేకపోవడం, అతివేగం , వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడంగానే ఏటా ప్రమాదాలు ఎక్కువగా నమోదవుతున్నాయని తెలపారు. ప్రతి ఒక్కరు విధిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని పేర్కొన్నారు. అనంతరం ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి, వాహనదారులకు హెల్మెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహీంద్రా అండ్ మహీంద్రా కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



పటాన్‌చెరు టౌన్: క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎక్సైజ్ సీఐ పరమేశ్వర్‌గౌడ్

పటాన్‌చెరు టౌన్: కల్లుగీత కార్మిక సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను పటాన్‌చెరు ఎక్సైజ్ కార్యాలయంలో గురువారం కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌గౌడ్, ఎక్సైజ్ సీఐ పరమేశ్వర్ గౌడ్ ఆవిష్కరించారు. అనంతరం రమేష్‌గౌడ్ మాట్లాడుతూ.. గీతా కార్మికుల సమస్యలను పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. చెట్ల పెంపకానికి భూమి, కల్లు మార్కెట్, నీర ఉత్పత్తులను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు యాదగౌడ్, ఎక్సైజ్ శాఖ సిబ్బంది,నాగేష్, సత్యనారాయణ, షాజహాన్ పాల్గొన్నారు.

జోగిపేట్ ఎక్సైజ్ కార్యాలయంలో

జోగిపేట : జోగిపేట్ ఎక్సైజ్ కార్యాలయంలో కల్లు గీత కార్మిక సంఘం క్యాలెండర్‌ను జోగిపేట ఎక్సైజ్ఎస్సైలు సందీప్‌రెడ్డి, విజయ్,సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌గౌడ్ ఆవిష్కరించారు.

సంక్షిప్త వార్తలు

◆ **అంగన్‌వాడీని పూర్తి చేయాలని నివేదిక**

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని లింగోజిగూడలో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనాన్ని పూర్తి చేసేందుకు ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు సీడీపీఓ హేమభార్గవి పేర్కొన్నారు. శిథిలావస్థ భవనంలో అంగన్‌వాడీ కొనసాగిస్తుండటంపై జిల్లా అధికారులకు నివేదించి నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటామన్నారు. అప్పటివరకు ప్రస్తుత భవనంలోని వరండాలో కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సంతోష, టీచర్ కవిత ఉన్నారు.

◆ **టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడుకి సన్మానం**

సంగారెడ్డి : మాత సంస్థ జిల్లా పరిశ్రమశాఖలో తిరిగి తన విధులు చేపట్టిన టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు జావిద్ అలీని సంఘం సభ్యులు గురువారం ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు.

◆ **ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు**

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీలోని ఎర్రచెరువు కట్టను మినీ ట్యాంక్ బండ్‌గా తీర్చిదిద్దేందుకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కృషి చేశారని తెలిపారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ చిమ్ముల నరసింహారెడ్డి పాలకవర్గ సభ్యుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలోని హాస్టల్ రోడ్డు నుంచి ఎర్ర చెరువు కట్ట వరకు నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు. గుమ్మడిదల అభివృద్ధికి ఎమ్మెల్యే సహకారం మరువలేనిదన్నారు.

◆ **సైబర్ నేరాలపై అప్రమత్తం**

కల్హేర్(నారాయణఖేడ్): సైబర్ నేరస్తుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని సిర్గాపూర్ ఎస్ఐ వెంకట్‌రెడ్డి సూచించారు. గురువారం సిర్గాపూర్ కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో సైబర్ నేరాలు, రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ మోసగాళ్లు, చట్టం గురించి విద్యార్థులు తమ తల్లిదండ్రులకు వివరించాలని కోరారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని హితబోధ చేశారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారిణి సంతోషి కుమారి ఉన్నారు.

◆ **రెండు రోజులుగా పాఠాలకు దూరం**

ఝరాసంగం(జహీరాబాద్): అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపంతో రెండు రోజులుగా పాఠాలకు విద్యార్థులు దూరంగా ఉన్నారు. మండలంలోని ప్యారవరం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడు .. 30కి పైగా విద్యార్థులు ఉన్నారు. గత రెండు రోజులుగా పాఠశాలకు ఉపాధ్యాయుడు రాకపోవడంతో విద్యార్థులు పాఠశాలకు వచ్చి ఆడుకొని, ఇంటికి వెళ్తున్నారు. దీంతో విద్యార్థులు తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయుడు సెలవుపై వెళ్తే ఇతర పాఠశాల ఉపాధ్యాయులను పంపించాలని కోరారు. విషయమై సంబంధిత కాంప్లెక్స్ హెచ్ఎంను వివరణ కోరగా రెండు రోజులుగా సెలవుపై వెళ్లినట్లు తెలిపారు.

◆ **పోలీసు కుటుంబాలకు వైద్య పరీక్షలు**



జహీరాబాద్ టౌన్: పట్టణంలోని పీవీఆర్ గార్డెన్‌లో గురువారం డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మెగా వైద్యం శిబిరం నిర్వహించారు. పోలీసు, హోంగార్డు, జర్నలిస్టు కుటుంబాలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యశిబిరాన్ని జిల్లా అడిషనల్ ఎస్పీ సంజీవ్‌రావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. పోలీసులు అలుపెరగకుండా విధులు నిర్వహిస్తుంటారని, కుటుంబ సభ్యులను రోగం వచ్చిన పట్టించుకోలేని పరిస్థితులు ఉంటాయన్నారు. పోలీసుల కుటుంబ సభ్యులకు వైద్యపరీక్షలు చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా 500 మందికి వైద్యులు పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ రాంమోహన్‌రెడి, జహీరాబాద్ టౌన్ సీఐ శివలింగం, టౌన్ ఎస్ఐ కాశీనాథ్ పలువురు ఎస్ఐలు పాల్గొన్నారు.